
సాక్షి వికారాబాద్

గురువారం : 5 : జనవరి : 2023



నిండా నీరున్నా..
ప్రభుత్వాలు మారుతున్నా ఆరుగాలం కష్టించి పనిచేసే రైతులకు కష్టాలు తప్పడంలేదు. 8లో▸



సమన్వయంతో పనిచేస్తేనే..
ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. 8లో▸



నాటడం.. వదిలేయడం
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హరితహారం కార్యక్రమం చివరకు నవ్వుల పాలవుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

అంధులు అన్ని రంగాల్లో రాణించాలి



అంధురాలికి పరికరాలు అందజేస్తున్న అధికారులు

వికారాబాద్ అర్బన్: అంధులు విద్య ద్వారా సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలనే బ్రెయిలీ లిపిని కనిపెట్టారని, ఇది ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది అంధులకు ఉపయోగపడుతోందని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితాకుమారి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీపీఆర్‌సీ భవన్‌లో లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంధుల కోసం ప్రత్యేక పరికరాలు అందిస్తోందన్నారు. అంధ విద్యార్థులు మరింతగా రాణించాలనే అత్యాధునిక పరికరాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు కృష్ణవేణి, ప్రియదర్శిని, జయరాం నాయక్, వెంకటేశ్వరమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఒకే తూము ద్వారా సాగునీరు

తహసీల్దార్ బుచ్చయ్య



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కొడంగల్ రూరల్: పట్టణ పరిధిలోని పెద్ద చెరువు రెండు తూముల్లో ఒకదాని ద్వారానే పంటలకు సాగుకు నీరు విడుదల చేస్తామని తహసీల్దార్ బుచ్చయ్య, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ తెలిపారు. బుధవారం ఆయకట్టు రైతులు యాసంగి సాగు కోసం చెరువు నీటిని విడుదల చేయాలని అధికారులను కలిశారు. చెరువుకు రెండు తూములు ఉన్నాయని కుక్కల తూము ద్వారా నీటిని వదులుతామని అధికారులు తెలిపారు. చెరువులో చేపలు జీవించేందుకు, పశువుల దాహార్తి తీర్చేందుకు 30శాతం నీరు ఉండాలన్నారు. మిగతా నీటిని సాగుకు విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, రైతులు చింతకాయల బాలయ్య, బొంకూరు సాయిరెడ్డి, కొల్లురు చిన్న మల్లప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను సక్సెస్ చేయాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గీత, కేజీబీవీ సిబ్బంది

కుల్కచర్ల: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై గీత కోరారు. బుధవారం కుల్కచర్లలోని కేజీబీవీలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీబీవీలో నాన్ టీచింగ్ స్టాఫ్ తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. చాలాకాలంగా పని చేస్తున్నా ఉద్యోగ భద్రత లేదన్నారు. వెంటనే తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ నెల 11న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర మహాసభలకు నాన్ టీచింగ్ వర్కర్స్ భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది భాగ్య, జగ్నీబాయి, లక్ష్మి, పద్మ, సత్యమ్మ, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ ఇంటర్వ్యూలు

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలో పాలియేటివ్ కేర్ కోసం ఫిజియో థెరపిస్ట్ ఉద్యోగ భర్తీకి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచిలర్ ఆఫ్ ఫిజియో థెరపీలో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ తోపాటు తెలంగాణ పారామెడికల్ బోర్డ్ నందు నమోదు చేయించుకొని ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 6న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

బాబోయ్.. ఇదేమి నోటిదూల!

ప్రజలతో మమేకం కావాల్సిన కొందరు నేతలు వారి నోటి దురుసుతో అభాసుపాలవుతున్నారు. అర్హులైన లబ్ధిదారులు సంక్షేమ ఫలాలు పొందాలంటే వారి అండదండలు ఉండాల్సిందే. పథకాల కోసం వచ్చే వారిని మీరు మాకు ఓటు వేశారా అన్ని ప్రశ్నించడం ప్రజల్ని అయోమయానికి గురి చేస్తోంది. ఇలాంటి సంఘటనలు మచ్చుకు కొన్ని..



ప్రజలతో అనుచితంగా ప్రవర్తిస్తున్న నేతలు

- పథకాలు అడిగితే మాకు ఓటు వేశావా అంటూ నిలదీత
- భూముల విషయంలో రైతులపై దౌర్జన్యాలు
- అధికార పార్టీ నేతలే అధికం
- వారంలో నాలుగు ఘటనలు
- అయోమయంలో జనం

వికారాబాద్: జిల్లాలో కొంత మంది నేతల తీరు ప్రజలకు అంతుపట్టడం లేదు. ప్రజల ఓట్లతో గెలిచి అందలమెక్కి వారిపైనే పెత్తనం చెలాయిస్తున్నారు. పింఛన్లు అడిగినా.. దళితబంధు మంజూరు చేయమన్నా.. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఇవ్వమన్నా కొందరు నేతలు మెలిక పెడుతున్నారు. అంతేకాదు లబ్ధిదారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నువ్వు మాకు ఓటు వేయలేదు కదా.. మీకెందుకు సంక్షేమం పథకాలు ఇవ్వాలి..? అని ప్రశ్నించడం ఇటీవల పరిపాటిగా మారింది. భూదందాల్లో తలదూర్చడం.. రైతుల్ని బెదిరించడం.. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకొని భూములు లాక్కునే ప్రయత్నం చేయడం, ప్రత్యర్థులను బెదిరింపులకు గురి చేయడం లాంటి ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. జిల్లాలో ఒకే వారంలో ఇలాంటి నాలుగు ఘటనలు చోటుచేసుకోవడం సామాన్యులను భయబ్రాంతులకు గురిచేస్తోంది.

ఒక్కోచోట ఒక్కో తరహాలో..

నేతలు, ప్రజాప్రతినిధుల ఆగడాలు, దాడులు ఒక్కోచోట ఒక్కో రకంగా వెలుగుచూస్తున్నాయి. కొన్ని చోట్ల సంక్షేమ పథకాలు తమకు వర్తింపజేయాలని అర్హులు నేతల గడప తడితే మాకు మీరు ఓటు వేయలేదంటూ వివక్షకు గురిచేస్తూ తిప్పి పంపుతున్నారు. ఇంకొన్ని చోట్ల మీకు పథకాలు వర్తింపజేయాలంటే మా పార్టీలోకి రావాలని తెగేసి చెబుతున్నారు. ఇంకొన్ని చోట్ల మంజూరైన సంక్షేమ పథకాలు ఇచ్చేందుకు మీరు మాకు ఓటు వేయలేదు కదా అని కుంటి సాకు చూసి తిప్పి పంపుతున్నారు. ఇవే కాదు రియల్ ఎస్టేట్ వ్యాపారం, భూ లావాదేవీల్లో తలదూర్చి ప్రత్యర్థులు, రైతులను బెదిరించడం, దాడులు చేయడంలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ విషయాల్లో కొన్ని చోట్ల బాధితులు పోలీసులను సైతం ఆశ్రయించి ఫిర్యాదులు కూడా చేశారు. అయితే ఈ విషయంలో పోలీసులపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టం పరిధిలో అందరూ సమానమే అంటూ లెక్చర్లు ఇచ్చే పోలీసులు సామాన్యుల విషయంలో ఒకలా... నేతలు, ప్రజాప్రతినిధుల విషయంలో మరోలా.. అధికార పార్టీకి చెందిన వారైతే ఇంకోలా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలు

- వారం రోజుల క్రితం రాష్ట్ర విద్యా మౌలిక వసతుల కల్పనా సంస్థ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్ అతని కుమారుడు ఓ వ్యక్తిని వికారాబాద్‌లోని వారి కార్యాలయానికి పిలిపించి భూమి విషయంలో దాడి చేశారు. సదరు వ్యక్తి వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతనిపై తరువాత నాగేందర్‌గౌడ్ సైతం ఫిర్యాదు చేశాడు.
- ఇటీవల మోమిన్‌పేట మండలం మొరంగపల్లికి చెందిన ఓ వ్యక్తి వికారాబాద్ ఎమ్మెల్యేపైన అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తమకు దళితబంధు పథకం వర్తింపజేయాలని అడిగితే దుర్భాషలాడారని, అతని అనుచరులు, పార్టీ నాయకులతో దాడి చేయించి బయటకు గెంటించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- దోమ మండలానికి చెందిన ఓ వ్యక్తికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. తోటి లబ్ధిదారులతోపాటు చెక్కు తీసుకునేందుకు వెళ్లాడు. అయితే నువ్వు తమకు ఓటు వేయలేదు కాబట్టి నీకు చెక్కు ఇవ్వమని ఆ మండల జెడ్పీటీసీ సభ్యుడు తేల్చిచెప్పాడు. ఈ విషయం పెద్ద దుమారమే లేపింది.
- గత వారం పూడూరు మండలం మిర్జాపూర్ రెవెన్యూ పరిధిలో పదెకరాల భూమి విషయంలో అధికార పార్టీ నేతలు హల్‌చల్ చేశారు. హైదరాబాద్ మేయర్ బంధువులు తమను బెదిరించారని స్థానిక రైతులు పేర్కొన్నారు. ఈ విషయంలో టీఆర్‌ఎస్ పరిగి నియోజకవర్గ నేతలు సైతం అక్కడ మేయర్ బంధువులకు అండగా నిలిచారని ఆరోపించారు.
- ఇటీవల మోమిన్‌పేట మండలంలో ఓ వికలాంగుడు తమ కాలనీలో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని కోరితే అధికార పార్టీ సర్పంచ్ అతన్ని తన్నుతూ చితకబాదిన ఘటన అధికార పార్టీ ఆగడాలకు పరాకాష్టగా నిలిచింది.
- ఇటీవల తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని కొందరు కలసి దళితబంధు మంజూరు చేయాలని కోరారు. మీరు తమ పార్టీలోకి వస్తేనే పథకం అమలు చేస్తామని ఎమ్మెల్యే చెప్పడం పెద్ద దుమారమే రేపింది.



రేగొండి ఉప సర్పంచ్‌కు వ్యతిరేకంగా చేతులు ఎత్తి ఓటింగ్‌లో పాల్గొన్న సర్పంచ్, వార్డు సభ్యులు

రేగొండి ఉప సర్పంచ్‌పై అవిశ్వాసం

- ఆర్డీఓ ఆధ్వర్యంలో ప్రక్రియ
- వ్యతిరేకంగా వార్డు సభ్యుల ఓటింగ్
- 15 రోజుల తరువాత ఉప సర్పంచ్ ఎన్నిక : ఆర్డీఓ అశోక్‌కుమార్

పెద్దేముల్: మండలంలోని రేగొండి ఉప సర్పంచ్ శివకుమార్‌పై బుధవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. తాండూరు ఆర్డీఓ అశోక్‌కుమార్ సమక్షంలో ఓటింగ్ ప్రక్రియ సాగింది. ఈ పంచాయతీలో మొత్తం 8మంది వార్డు సభ్యులు ఉన్నారు. ఎన్నికల ఖర్చు వివరాలు ఇవ్వని 1, 2 ,5 వార్డు సభ్యులను సస్పెండ్ చేశారు. అప్పట్లో మిగిలిన ఐదు వార్డుల సభ్యులు 6వ వార్డు సభ్యుడు శివకుమార్ ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఇటీవల సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య విభేదాలు తలెత్తడంతో ఉప సర్పంచ్‌ను తొలగించాలని ఏడాది క్రితం గ్రామ పంచాయతీ సభ్యులు తీర్మానం చేశారు. గత ఏడాది డిసెంబర్ 14న ఆర్డీఓ అశోక్‌కుమార్‌కు రాతపూర్వకంగా సర్పంచ్ హైదర్ ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు 16–12–22లో ఫామ్–4 నోటీసు జారీ చేశారు. బుధవారం ఉప సర్పంచ్ శివకుమార్‌పై అవి శ్వాస తీర్మానం పెట్టారు. 3, 4, 7, 8వ వార్డు సభ్యులు జగ్గమ్మ, అమృత, ఎరుకల అంజిల య్య, లలిత, సర్పంచ్ హైదర్ అవిశ్వాస తీర్మా నంలో పాల్గొని ఉప సర్పంచ్‌కు వ్యతిరేకంగా చేతులు ఎత్తి ఓటింగ్ చేశారు. దీంతో అధికారు లు సమావేశాన్ని ముగించారు. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్ కమిషనర్, కలెక్టర్, డీపీఓ దృష్టికి తీసుకెళ్లి 15 రోజుల తరువాత ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దేముల్ తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మప్ప, పంచాయతీ కార్యదర్శి జమీల్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలి



అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ తరుణ్‌కుమార్

- డీపీఓ తరుణ్‌కుమార్

కొడంగల్ రూరల్: పచ్చదనం, పరిశుభ్రతపై గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రాధాన్యత ఇచ్చేలా పంచాయతీ సిబ్బంది చొరవ చూపాలని జిల్లా పంచాయత్ రాజ్ అధికారి తరుణ్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని పర్సాపూర్‌లో ఆయన పర్యటించారు. పల్లె ప్రకృతి వనం, పారిశుద్ధ్య పనులు, క్రిమిటోరియం, నర్సరీలను పరిశీలించి పలు సూచనలు అందించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రామాలు పచ్చదనంతో వెల్లివిరిసేలా విరివిగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై మురుగు పారకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెత్తాచెదారం బయట పడేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం డీపీఓ తరుణ్‌కుమార్‌ను సర్పంచ్ సయ్యద్ అంజాద్, పంచాయతీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ రాములు, పంచాయతీ కార్యదర్శి కల్పన, టీఏ శ్రీనివాస్, నాయకులు గోవిందు తదితరులు పాల్గొన్నారు.



టికెట్ల అమ్మకాలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్

ఫార్ములా– ఈ రేస్ టికెట్ల అమ్మకాలు షురూ

- రూ.1000 నుంచి రూ.10 వేల వరకు
- బుక్ మై షో ద్వారా విక్రయాలు

సాక్షి, సిటీబ్యూరో: మోటారు స్పోర్ట్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఏబీబీ ఎఫ్ఐఏ ఫార్ములా– ఈ వరల్డ్ చాంపియన్‌షిప్ రేస్ టికెట్ల అమ్మకాలు బుధవారం ప్రారంభమయ్యాయి. హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ తొలి టికెట్ కొనుగోలు చేసి అమ్మకాలను లాంఛనంగా ప్రారంభించారు. నెక్లెస్‌రోడ్డులోని 2.8 కిలోమీటర్ల స్ట్రీట్ సర్క్యూట్‌లో ఫిబ్రవరి 11న ఈ పోటీలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఎలక్ట్రిక్ రేస్ కార్‌లలో 8 సీజన్స్ పూర్తయ్యాయని, 9వ సీజన్‌లో 4వ లెవల్ పోటీలకు హైదరాబాద్ వేదికగా నిలిచిందని చెప్పారు. ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా గుర్తింపును పొందిన హైదరాబాద్ నగరం ఈ– మొబిలిటీకి గ్లోబల్ డెస్టినేషన్‌గా మారనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అక్బర్ ఇబ్రహీం, దేశంలో మొదటిసారి హైదరాబాద్‌లో ఫార్ములా– ఈ పోటీలను పరిచయం చేస్తున్న సంస్థ ఏస్‌నెక్స్ట్ జనరేషన్ (ఏసీఈ ఎన్ఎక్స్‌టీజీఈఎన్) సీఈఓ దిల్‌బాగ్‌జిల్, కిరణ్‌రావు పాల్గొన్నారు.

మొత్తం 22,500 టికెట్‌లు..

- ఫార్ములా– ఈ రేస్ కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేయనున్నారు. 25వేలకు పైగా సీట్ల సామర్థ్యంతో వీటిని ఏర్పాటు చేస్తారు. వీటిలో 22,500 సీట్లకు మాత్రమే టికెట్‌లను విక్రయించనున్నారు.
- బుక్ మై షో, ఏస్ నెక్స్ట్‌జెన్.కామ్ ద్వారా టికెట్‌లను బుక్ చేసుకోవచ్చు. నాలుగు కేటగిరీల్లో టికెట్‌లు లభిస్తాయి. రూ.1000 విలువైనవి సుమారు 5000 సీట్లు ఉన్నాయి. ఇవి కాకుండా మిగతావి రూ.3500, రూ.6000, రూ. 10వేల చొప్పున విక్రయించనున్నారు.

సందర్శకులకు అనుమతి....

- ఫిబ్రవరి 11న ఉదయం 10.40 గంటలకు క్వాలిఫైయింగ్ రేస్ నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల వరకు పోటీలు కొనసాగుతాయి. ఈ సందర్భంగా నెక్లెస్‌రోడ్డుతో పాటు నగరంలోని ప్రధాన కూడళ్లలో 10 భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తారు. పోటీలకు ముందు రోజు ఫిబ్రవరి 10న సాధారణ సందర్శకులను, స్కూల్ పిల్లలను సైతం అనుమతిస్తారు. ఫార్ములా– ఈ పోటీల దృష్ట్యా ఫిబ్రవరి 6నుంచి 11 వరకు నగరంలో ఈ– మొబిలిటీ అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.
- నెక్లెస్‌రోడ్డు మార్గంలో ఫిబ్రవరి 8వ తేదీ సాయంత్రం నుంచి 11వరకు వాహనాల రాకపోకలను నిలిపివేస్తారు. ఆ మార్గంలో వెళ్లే వాహనాలను ఇతర మార్గాల్లోకి మళ్లిస్తారు.

ఎర్రరాయి.. పరాయి

- అసైన్డ్ భూములు అన్యాక్రాంతం
- ఆపై యథేచ్ఛగా ఎర్రరాయి తవ్వకాలు
- కర్ణాటక వ్యాపారుల అక్రమ దందా
- లీజు, రాయల్టీ లేకుండానే వ్యాపారం
- పట్టించుకోని మైన్స్, రెవెన్యూ శాఖలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



అసైన్డ్ భూముల్లో ఎర్రమట్టి, రాయి తవ్వకాలు

పెద్దేముల్: పేదలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. అంతేకాకుండా ఆ భూముల్లో కర్ణాటక వ్యాపారులు యథేచ్ఛగా ఎర్రరాయి తవ్వకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అమాయక గిరిజనులకు నయానో, భయానో ఒప్పించి అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. లీజు, రాయల్టీ లేకుండా ఎర్రరాయి తవ్వకాలు చేస్తున్నారు. ఇంతజరుగుతున్నా మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి గుట్టుగా వ్యాపారం సాగుతోంది.

కర్ణాటక సరిహద్దు కావడంతో..

పెద్దేముల్ మండలం కర్ణాటక సరిహద్దులో ఉంది. ఈ మండలంలోని పాషాపూర్, అడ్కిచెర్ల, ఓంలానాయక్ తండా, రాంసింగ్ తండాతోపాటు మరి కొన్ని గ్రామాల్లో భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం అసైన్డ్ భూములు కేటాయించింది. పాషాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 41, 42, 43లో 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని విడతల వారీగా పేదలకు పంపిణీ చేశారు. ఈ భూముల్లో ఎర్రరాయి, మట్టి నిల్వలు ఉండడంతో కొంత మంది కర్ణాటక వ్యాపారులు అక్రమ దందాకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ వ్యాపారంపై స్థానికులు పలుమార్లు కలెక్టర్, మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ ఎలాంటి ఫలితం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నిర్మాణ రంగంలో ఎర్రరాయికి డిమాండ్ ఉండడంతో ఒక్కో వ్యాపారి ఐదు నుంచి పది గనులను ఏర్పాటు చేసి తవ్వకాలు సాగిస్తున్నారు. లారీలు, ట్రాక్టర్లలో ఎర్రరాయిని కర్ణాటక, తెలంగాణలోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్కో రాయి రూ. 20 నుంచి రూ. 25పైగా ధర పలుకుతోంది. తొలుత మరుగుదొడ్ల నిర్మాణం పేరుతో మొదలైన తవ్వకాల దందా ప్రస్తుతం నిరాటకంగా కొనసాగుతునే ఉంది.

రాయల్టీ, లీజు లేకుండానే..

ప్రభుత్వ, పట్టా భూముల్లో ఎర్రరాయి, మట్టి, సుద్ద తవ్వకాలు జరపాలంటే సర్కారు అనుమతి తప్పనిసరి. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎన్‌ఓసీ తీసుకొని మైన్స్ శాఖ ద్వారా లీజు పొందాలి. రాయల్టీ చెల్లించి మట్టిని తరలించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు ఈ పద్ధతులేమీ పాటించకుండానే ఎర్రరాయి, సుద్ద, మట్టిని తరలిస్తున్నారు. దీంతో ఏటా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ విషయాన్ని పట్టించుకోవాల్సిన మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులు ఒకరిపై ఒకరు వేసుకొని చేతులు దులుపుకుంటున్నారు.



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ అనుమతి లేకుండా ఎర్రరాయి, ఎర్ర మట్టి, సుద్ద తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటాం. గతంలో కూడా పలుమార్లు ఫిర్యాదులు వచ్చాయి. తనిఖీలు చేసి చర్యలు తీసుకున్నారం. ఇక్లీ తవ్వకాలు జరిగే ప్రాంతాలను పరిశీలించి యంత్రాలు సీజ్ చేస్తాం. వ్యాపారులపై కేసులు నమోదు చేస్తాం. అసైండ్ భూముల్లో తవ్వకాలు జరపడం నేరం.

– అశోక్‌కుమార్, ఆర్డీఓ, తాండూరు

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్



పోలీసుల అదుపులో ఎల్లప్ప

తాండూరు టౌన్: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను తాండూరు పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన మధుర ఎల్లప్ప తన ట్రాక్టర్‌లో ఖాంజాపూర్ సమీపంలోని కాగ్నానది నుంచి మంగళవారం అర్ధరాత్రి సాయిపూర్‌కు ఇసుక తరలిస్తున్నాడు. దీంతో పోలీసులు తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఎల్లప్పను అరెస్టు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

‘హన్మంతుపై కేసు ఎత్తివేయాలి’

కొడంగల్ రూరల్: రావులపల్లిలో అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్‌పై పోలీసులు చట్ట రీత్యా చర్యలు తీసుకోవడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, కానీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించిన హన్మంతుపై పెట్టిన కేసును ఎత్తివేయాలని అంబేడ్కర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ బహదూర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో పలు సంఘాల నాయకుల తో కలిసి ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో పూలే అంబేడ్కర్ జాతర కమిటీ అధ్యక్షుడు జి.సుధాకర్, కార్యదర్శి లక్ష్మన్న, జాంబవ రాజు గురువు, ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తురు చంద్రయ్య, అంబేడ్కర్ యువజన సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు, వివిధ సంఘాల శ్రీనివాస్, డాక్టర్ వెంకటేశ్వర్లు, సూర్యానాయక్, ఇస్వప్ప, కేశవులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పహాడీషరీఫ్: బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన సాహు గతేడాది బతుకుదెరువు నిమిత్తం జల్‌పల్లికి వలస వచ్చాడు. రోజు మాదిరిగానే జనవరి 1న సాహు, అతడి భార్య లక్ష్మి పనికి వెళ్లారు. అదే రోజు మధ్యాహ్నం వారి పని వద్దకు వచ్చిన కుమార్తె కాజల్ (17) బోర్‌ఆన్ చేస్తానంటూ వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లభించలేదు. మహారాష్ట్రకు చెందిన సయ్యద్ సోనూ అలీపై అనుమానం ఉందంటూ సాహు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 94906 17241 నెంబర్‌లో గాని సమాచారం అందించాలని కోరారు.

నిండా నీరున్నా.. ఫలితం సున్నా!

- మరమ్మతులకు నోచుకోని కాల్వలు, అలుగులు
- బీళ్లుగా మారుతున్న భూములు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: ప్రభుత్వాలు మారుతున్నా ఆరుగాలం కష్టించి పనిచేసే రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఈ ఏడాది భారీ వర్షాలు కురువడంతో చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. యాసంగిలో సాగు నీటికి ఢోకా లేదనుకున్న రైతులకు నిరాశే మిగిలేలా ఉంది. చెరువు కింద దెబ్బతిన్న కాల్వలు, అలుగులకు మరమ్మతులు చేపట్టడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెరువులపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. మిషన్ కాకతీయ పథకం కింద మరమ్మతులు చేపట్టినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

నీట మునుగుతున్న పంటలు

మండల పరిధిలో 33 గ్రామ పంచాయతీలుంగా వాటి పరిధిలో సుమారు తొమ్మిది చెరువులు ఉన్నాయి. దౌల్తాబాద్, బాలంపేట, గోకఫసల్‌వాద్, ఈర్లపల్లి గ్రామాల్లో చెరువులను మూడున్నర దశాబ్దాల కిందట నిర్మించారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో చెరువులు నిండు కుండలా మారాయి. చెరువుల కింద కాల్వలు పాడవ్వడంతో భూములకు సాగునీరు అందడంలేదు. పలు చోట్ల అలుగులు కూడా దెబ్బతిన్నాయి. దీంతో వర్షాకాలంలో పంటలు నీట మునిగి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దౌల్తాబాద్‌లో ధ్వంసమైన చెరువు అలుగు

పర్యవేక్షణ కరువు

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నిర్మించిన చెరువులను అధికారులు ఎప్పటికప్పుడు సందర్శించి మరమ్మతులు చేపట్టాలి. కానీ మండలంలో మాత్రం అందుకు విరుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెరువులు పశువులకు నీటితొట్టిలుగా మారుతున్నాయి. ప్రతీ చెరువు ఆయకట్టు కింద 200నుంచి 300 ఎకరాల వరకు సాగు అవుతుందని వ్యవసాయధికారులు అంచనా వేసినా ఇక్కడ అలాంటి పరిస్థితి కనిపించడంలేదు.

నీరు అందడంలేదు



పెద్ద చెరువు కింద వ్యవసాయ భూమి ఉంది. ఈ చెరువు కింద ఉన్న తూములు, కాల్వలు మరమ్మతులు చేయాల్సి ఉండడంతో నీరు వదలడంలేదు. అధికారులు స్పందించి ప్రధాన కాల్వలకు మరమ్మతులు చేయించి ఆయకట్టుకు నీరు అందించాలి.

– నర్సింలు, రైతు, దౌల్తాబాద్

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ పార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి తెలంగాణలోనే ఉందన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. 12 గ్రామాలకు చెందిన కార్యకర్తలు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. సమీక్షలో పార్టీ అభ్యున్నతిపై కాకుండా అన్ని గ్రామాల నేతలు అభివృద్ధి పనులపైనే వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి ఇబ్బందులు లేకుండా పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

విద్యార్థుల అభ్యున్నతికి సహకారం

పరిగి: పేదల, విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం సహకరిస్తానని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మహ్మదాబాద్ మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన అర్చన కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో దేహ దారుఢ్య పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మెయిన్స్‌కు సిద్ధమవుతోంది. దీంతో ఆమె కోచింగ్ నిమిత్తం ఎమ్మెల్యే రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ లేదని.. ప్రభుత్వ ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. ఏవిధమైన సాయం కావాలని తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

- విచారణ వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తాం
- ఎంఈఓ వెంకటయ్య
- ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని పలు సంఘాలు డిమాండ్

పెద్దేముల్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రిన్సిపాల్ కుల వివక్ష చూపుతోందని గోట్లపల్లి మోడల్ స్కూల్‌లో రెండు రోజులుగా ఆందోళన కొనసాగుతోంది. దీంతో బుధవారం తాండూరు రూరల్ సీఐ రాంబాబు, ఎంఈఓ వెంకటయ్య, పెద్దేముల్ ఎస్ఐ అబ్దుల్‌రవూఫ్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ గాయత్రిని విచారించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులచే ప్రత్యేక కమిటీ వేయాలని ఆదేశాలు జారీ చేశారు. టాయిలెట్స్ పరిశీలించారు. ఉపాధ్యాయుల నడుమ గ్రూపు తగాదాల వల్లే గొడవలు జరుగుతున్నాయని.. ఇదే విషయం ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంఈఓ చెప్పారు. ఉపాధ్యాయుల పనితీరు మారకపోతే చర్యలు తప్పవన్నారు. ప్రిన్సిపాల్ కుల వివక్ష చూపుతోందని, మధ్యాహ్నభోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు అధికారులు తెలిపారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి: పీడీఎస్‌యూ

మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని పీడీఎస్‌యూజిల్లా ఉపాధ్యక్షుడు దీపక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. శుద్ధమైన తాగునీటిని అందించాలని కోరారు. చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.

ప్రిన్సిపాల్‌పై పోలీసులకు ఫిర్యాదు

కులం పేరుతో విద్యార్థులను వేధిస్తున్న గోట్లపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రిపై చర్యలు తీసుకోవాలని బీవీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింలు బుధవారం పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రిన్సిపాల్ కులం పేరుతో అవమానపర్చడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు విద్యార్థుల సమస్యలు తెలుసుకుని పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంఈఓ వెంకటయ్య

సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి

వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్

మర్పల్లి: ప్రజాప్రతి నిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో మీతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు మధుకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వివిధ పథకాలపై అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి మీతో నేను కార్యక్రమం ఓ వేదికగా నిలుస్తుందన్నాడు. రావులపల్లి జిల్లాలో ఆదర్శ గ్రామం నిలువడం వెనుక మండల ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం పనితీరుకు నిదర్శనమన్నారు. గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాభివృద్ధికి రూ.7లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రవి, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ యాదయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు మల్లేశం, ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఆర్ఐ దశరథ, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఏపీఓ అంజిరెడ్డి, ఈసీ విఠల్, ఏ పీఓ మధుకర్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాచన్న, ఉపాధ్యాక్షుడు అశోక్, గౌస్, యూత్ ప్రెసిడెంట్ మధుకర్, మాజీ వైస్ ఎంపీపీ అంజయ్యగౌడ్ తదితరులు ఉన్నారు. అనంతరం మర్పల్లి మార్కెట్ ఆవరణలో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎంపీపీ లలితా రమేశ్, జెడ్పీటీసీ మధుకర్‌తో కలిసి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.



రావులపల్లిలో ‘మీతో నేను’లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే అనంద్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గతేడాది ఆదర్శపాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో అత్యధిక గ్రేడ్స్ సాధించిన విద్యార్థులను సబిత ఆనంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి డిక్షనరీ, షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సోయేల్, ఎంఈఓ విద్యాసాగర్, ఆదర్శ పాఠశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ కృష్ణకుమార్, ఎస్టీ ఆశ్రమ గురుకుల పాఠశాల హెచ్ఎం నర్సింగ్ రావు, కస్తూర్బా బాలికల పాఠశాల ప్రత్యేకాధికారి శైలజ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగిన మత్తులో డ్రైవింగ్..

చెట్టును ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు

ధారూరు: మద్యం మత్తులో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి చెట్టును ఢీకొట్టి పడిపోయాడు. ఈ ఘటన మండల పరిధిలోని కేరెల్లి రైతువేదిక ఎదుట ప్రధాన రోడ్డుపై బుధవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారంకోట్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి(40) ఫుల్‌గా మద్యం సేవించి బైక్‌పై ధారూరు వైపునుంచి వికారాబాద్‌కు వెళ్తున్నాడు. మద్యం మత్తులో బైక్‌ను వేగంగా నడుపుతూ బాచారం రోడ్డు క్రాస్ వద్ద రైతు వేదిక ఎదుట రోడ్డుపక్కన నాటిన చెట్టును ఢీకొట్టాడు. దీంతో బైక్ పక్కనే ఉన్న గుంతలో పడిపోగా, రాజేందర్‌రెడ్డి రోడ్డు పక్కనే తీవ్రగాయాలతో స్పృహతప్పి పడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ‘సాక్షి’ విలేకరి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రున్ని 108లో ఆస్పత్రికి తరలించారు. కాగా రాజేందర్‌రెడ్డిపై బైక్ దొంగతనం కేసులు ఉండడంతో బైక్ తనదేనా.?దొంగతనం చేసుకువెళ్తున్నాడా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ఎస్ఐ నరేందర్ తెలిపారు.



గాయపడిన రాజేందర్‌రెడ్డి



క్షతగాత్రుడిని 108 వాహనంలోకి ఎక్కిస్తున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్

చెరువులో వ్యర్థాలను తొలగించండి

కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్



చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు టౌన్: పట్టణంలోని గొల్లచెరువులో వ్యర్థాలను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గొల్లచెరువును నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల ఆందోళనకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు మద్దతు ప్రకటించారు. చెరువును సందర్శించి మత్స్యకారుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. గొల్లచెరువుపై ఆధారపడి సుమారు 100 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. చెరువులో వ్యర్థ్యాలు, గుర్రపుడెక్క నిండుకుని ఉండటంతో చేపలు పట్టడం వారికి ఇబ్బందిగా మారింది. వ్యర్థాలను తొలగించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. పది రోజులుగా ఆందోళన చేస్తున్నా.. మత్స్యకారుల సమస్య కు పరిష్కారం చూపిస్తామన్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, స్పందించి గొల్లచెరువులోని వ్యర్థాలను తొలగించి, మత్స్యకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంతోశ్, వెంకటయ్య, భీంశంకర్ పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా ప్రభుత్వ వైద్యం

చికిత్సకు వెళ్లిన బాధితుడిని వెనక్కి పంపిన సిబ్బంది



ఆస్పత్రి ఎదుట బాధితుడు దస్తయ్య

దోమ: ప్రభుత్వ వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారుతోంది. మండల పరిధిలోని పాలేపల్లి గ్రామానికి చెందిన బాధితుడు దస్తయ్య పొలంలో పనులు చేస్తుండగా కాలుకు గాజు పెంకు గుచ్చుకుంది. దీంతో బాధితుడు చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. దీంతో సిబ్బంది గాజు పెంకు గుచ్చుకుంటే తమ దగ్గర వైద్యం లేదని సిబ్బంది వెనక్కి పంపించారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. దీంతో చేసేది లేక పరిగి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని బాధితుడు కోరాడు.

7న పార్టీ కార్యకర్తల సమ్మేళనాలు

బీజేపీ మీడియా రాష్ట్ర కన్వీనర్ సుధాకర్‌శర్మ

తుక్కుగూడ: టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను, మోసాలను ప్రజలకు వివరించేందుకు ఈ నెల7న రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బీజేపీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మీడియా రాష్ట్ర కన్వీనర్ వి.సుధాకర్‌శర్మ అన్నారు. బుధవారం ఆయన తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అర్హులందరికీ ఎన్నో సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు మదన్ మోహన్‌గుప్తా, కౌన్సిలర్ బాకి విలాస్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెచ్చిన చోటే వదిలేయండి

ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ నిర్వాహకులను కోరిన చైర్‌పర్సన్

వికారాబాద్ అర్బన్: జనన నియంత్రణ కోసం కుక్కలను ఎక్కడి నుంచి తీసుకువచ్చారో ఆపరేషన్ తర్వాత అక్కడే వదిలేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమంలో ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. బుధవారం ఆమె ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్వతంత్ర ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రెటరీ మహన్విత్ రెడ్డి నుంచి వివరాలు తెలుసుకున్నారు. వికారాబాద్‌లో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశాక కుక్కల బెడద ఎక్కువయ్యాయని ఫిర్యాదులు వస్తున్నాయని ఆయనకు తెలిపారు. జనన నియంత్రణకు కుక్కలను తీసుకువచ్చి వికారాబాద్ పట్టణంలో వదిలేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రామ్‌కిషన్, ఏఈ రాజ్‌కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మొయినుద్దీన్ తదితరులు ఉన్నారు.



సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న మంజుల

గొల్లగూడ స్టేషన్‌లో రైళ్లు నిలపాలి

స్టేషన్ పర్యవేక్షకుడికి సర్పంచ్ వినతి



ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

నవాబుపేట: గొల్లగూడ రైల్వేస్టేషన్‌లో కోవిడ్ వ్యాప్తికి ముందు ఆగిన రైళ్లను మళ్లీ నిలిపేలా చర్యలు తీసుకోవాలని గొల్లగూడ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ గ్రామస్తులతో కలిసి గొల్లగూడ స్టేషన్ పర్యవేక్షకుడు ప్రశాంత్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి పూర్ణ వెళ్లే రైలు నెంబర్ 07647. హైదరాబాద్ నుంచి బీజాపూర్ వెళ్లే 17030 రైలు. హైదరాబాద్ నుంచి ఔరంగాబాద్ వెళ్లే 17649 రైళ్లతో పాటు.. ఔరంగాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే 17650 రైళు. బీజాపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే 17025 రైలు. వాడీ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే 07751 రైలు. పూర్ణా నుంచి హైదరాబాద్‌కు వెళ్లే 07648 రైళ్లు కరోనాకు ముందు గొల్లగూడ రైల్వే స్టేషన్‌లో నిలిపేవారన్నారు. ఇప్పటికీ ఆ రైళ్లను నిలపకపోవడంతో గొల్లగూడ స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే దాదాపు 1500 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వే అధికారులు స్పందించి రైళ్లు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

వికారాబాద్ అసెంబ్లీ ప్రభారి విద్యాసాగర్

ధారూరు: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖామయని వికారాబాద్ అసెంబ్లీ ప్రభారి విద్యాసాగర్ అన్నారు. మండల పరిధిలోని మోమిన్‌కలాన్, గురుదోట్ల, రాజాపూర్ శక్తి కేంద్రాల్లో బుధవారం బూత్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతీ గ్రామం, తండాల్లో శక్తికేంద్రం ఇన్‌చార్జి బూత్ కమిటీ సమావేశాలను ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కల్పిస్తారని చెప్పారు. టీఆర్‌ఎస్ కుటంబ, అవినీతి పాలనకు విముక్తి కలిగించే విధంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలనీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు ఎం.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న విద్యాసాగర్